ప్రజాశక్తి
www.prajasakti.com
I

నీటిలో మునిగిన పంటపొలాలు

పంట పొలాల్లోకి మంజీరా బ్యాక్ వాటర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో సింగూరు జలశయం నుంచి విడుదల చేసిన వరద నీటితో పాటు కర్ణాటక నుంచి వచ్చే బ్యాక్ వాటర్ అంతా మంజీరకు చేరుతుంది. దాంతో మంజీర బ్యాక్ వాటర్‌తో పంటపొలాలు మునగడంతో పాటు ఇళ్లలోకి నీరు వచ్చి చేరింది. సంగారెడ్డి జిల్లా మనూర్ మండలం నదిగడ్డ హెుక్రాన గ్రామపంచాయతీ పరిధిలో ఇండ్లలోకి నీరు వచ్చి చేరింది.

ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు కర్ణాటక నుంచి వచ్చే బ్యాక్ వాటర్ భారీగా వదలడంతో పూర్తిగా పంట పొలాలు మునిగిపోయాయని పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. నీరు ఇండ్ల మధ్యలోకి రావడంతో గ్రామ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. నష్టపోయిన పంట పొలాలకు నష్టపరిహారం అందించాలని గ్రామ రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

బలమున్న చోట సొంతంగానే పోటీ

- స్థానిక ఎన్నికల్లో బిజెపిని ఓడించడమే మా కర్తవ్యం
- సర్దుబాట్లపై 4న రాష్ట్ర కమిటీలో నిర్ణయం
- ఏజెన్సీలో గిరిజనేతరులకు రిజర్వేషన్‌ను ఆపాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో తాము బలంగా ఉన్న ప్రాంతాల్లో, ప్రజా ఉద్యమాలను నిర్మించిన చోట స్థానిక సంస్థల ఎన్నికల్లో సొంతంగానే పోటీకి సన్నద్ధమవుతున్నామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎంబి భవన్‌లో తనను కలిసిన విలేకర్లతో ఆయన మాట్లాడుతూ వామపక్ష పార్టీలతో అవసరమైన చోట సర్దుబాటు చేసుకోవాల్సిన పరిస్థితి ఉంటుందని అన్నారు. వాటిపై చర్చించుకుని ముందుకెళ్తామని వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపిని ఓడించడమే తమ రాజకీయ కర్తవ్యమని స్పష్టం చేశారు. ప్రజాస్వామిక హక్కులను, లౌకిక విలువలను, రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తున్నదని విమర్శించారు. మతోన్మాద రాజకీయాలు చేస్తున్న బిజెపిని ఓడించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లకు బిజెపి అడ్డుపడిందని విమర్శించారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. భూమి కోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం సాగిందని గుర్తు చేశారు. కానీ హిందూ, ముస్లింలకు మధ్య ఈ పోరాటం సాగిందంటూ బిజెపి చరిత్రను వక్రీకరిస్తున్నదని విమర్శించారు. మత వైషమ్యాలను పెంచుతున్నదని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఎం, వామపక్ష పార్టీలను ప్రజలు బలపర్చాలని కోరారు. తాము, వామపక్షాలు పోటీ చేసిన చోట బిజెపిని ఓడించాలని పిలుపునిచ్చారు. తాము పోటీ చేయని చోట ఎన్నికల్లో సర్దుబాటు, కార్యాచరణ ఎలా ఉండాలనే దానిపై అక్టోబర్ నాలుగో తేదీన పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని వివరించారు.

ఆ జడ్‌పి చైర్మన్ స్థానాలు ఎస్టీలకే ఉండాలి

ఏజెన్సీ ప్రాంతం స్థానికసంస్థల ఎన్నికల్లో గిరిజనేతరులకు రిజర్వేషన్‌ను కేటాయించడాన్ని వెంటనే నిలిపేయాలని జాన్‌వెస్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐదో షెడ్యూల్ ప్రాంతంలో గిరిజనేతరులకు రిజర్వేషన్ అమలు చేయొద్దంటూ నిబంధనలున్నాయని చెప్పారు. ఐదో షెడ్యూల్ ప్రాంతంలోని జడ్‌పిటిసి, ఎంపిటిసి స్థానాలను కూడా గిరిజనులకే రిజర్వేషన్‌ను కేటాయించాలనీ, ఏజెన్సీ బయట ఉన్న ప్రాంతంలో మిగిలిన వారికి రిజర్వేషన్ ఇవ్వాలని సూచించారు. షెడ్యూల్ ప్రాంతంలో గిరిజనేతరులకు అవకాశమిచ్చే రొటేషన్ పద్ధతిని ఆపాలని డిమాండ్ చేశారు. గిరిజన జనాభా అధికంగా ఉన్న జిల్లాల్లో జిల్లా పరిషత్ చైర్మెన్ స్థానాలకు ఎస్టీ రిజర్వేషన్ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన జిల్లా పరిషత్ రిజర్వేషన్‌లో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని అన్నారు. ఆదివాసీలు అధికంగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్, కొమరం భీం ఆసిఫాబాద్, మహబూబాబాద్ జెడ్పీ చైర్మెన్ స్థానాలను జనరల్ స్థానాలుగా ప్రకటించడం సరైంది కాదని చెప్పారు. రిజర్వేషన్లు రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ హక్కులకు, పీసా చట్టాలను నీరుగార్చేలా ఉన్నాయని విమర్శించారు. ఐదో షెడ్యూల్ ప్రాంతంలో ఉన్న జడ్‌పి చైర్మన్, జడ్‌పిటిసి, ఎంపిటిసి స్థానాల్లో ఎస్‌టి రిజర్వేషన్ కొనసాగించేలా ఉత్తర్వులను సవరించాలని డిమాండ్ చేశారు. ఐదో షెడ్యూల్ హక్కులను హరించేలా అక్కడ నివసిస్తున్న స్థానిక ఆదివాసీ ప్రజల అవకాశాలను దూరం చేసేలా ఉన్న ఈ నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు : సిఎం, గవర్నర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రజలకు విజయదశమి సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రాష్ట్ర ప్రజలకు విజయదశమిశుభాకాంక్షలు తెలిపారు. నవరాత్రి పండుగ మనల్ని ఆనందం, ఆనందోత్సా హాల స్ఫూర్తితో పునరుజ్జీవింపజేస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ పండుగ ప్రధాన ఇతివత్తం చెడుపై మంచి సాధించిన విజయమనీ, దానికి శాశ్వత ప్రాముఖ్యత ఉందని గుర్తు చేశారు. ఎప్పటికీ సత్యమే విజయం సాధిస్తుందనేది మన జాతీయ నినాదమన్నారు. ఈ పండుగను జరుపుకునేట ప్పుడు, వ్యాధులు, పర్యావరణ ప్రమాదాలు, బాహ్య ముప్పులు వంటి అన్ని చెడులను ఎదుర్కోవడానికి, పచ్చదనంతోపాటు ఆరోగ్యకరమైన దేశాన్ని సృష్టించడానికి మనం సమిష్టిగా ప్రయత్నించాలని సూచించారు. దసరా పండుగ వేడుకల సందర్భంగా దైవిక తల్లి తన అత్యుత్తమ ఆశీర్వాదాలను కురిపించాలని ప్రార్థిస్తున్నట్టు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ధర్మానిదే విజయం : కెసిఆర్

రాష్ట్ర ప్రజలకు బీఆర్‌ఎస్ అధినేత, తెలంగాణ మాజీ సిఎం కె చంద్రవేఖర్‌రావు దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఓటమి నుంచి రాష్ట్ర ప్రజల జీవితాలు గెలుపు దిశగా పయనించాలని కెసిఆర్ ఆకాంక్షించారు. తొమ్మిది రోజుల బతుకమ్మ సంబురాలతో పాటు, దేవీ శరన్నవరాత్రుల దుర్గమ్మ పూజల పర్వదినాలకు కొనసాగింపుగా, విజయ దశమిగా జరుపుకునే దసరా పండుగకు తెలంగాణ ప్రజా జీవనంలో ప్రత్యేక స్థానం ఉందని కెసిఆర్ అభిప్రాయపడ్డారు.

సదరన్ ట్రావెల్స్‌కు రెండోసారి గ్లోబల్ టూరిజం అవార్డు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో అత్యంత విశ్వసనీయంగా ఎన్నో బహుమతులు అందుకున్న సదరన్ ట్రావెల్స్ గ్లోబల్ టూరిజం అవార్డు-2025లో బెస్ట్ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్ పురస్కారాన్ని అందుకుంది. వరుసగా రెండోసారి ఈ ప్రతిష్టాత్మక అవార్డును గెలుచుకోవడం గమనార్హం. పర్యాటక, హాస్పిటాలిటీ రంగాల్లో అత్యున్నత, ఆధునీకతకు గౌరవం తెలిపేలా అంతర్జాతీయ స్థాయిలో గ్లోబల్ టూరిజం అవార్డులను ప్రదానం చేస్తారు. ఈ వేడుక నోయిడాలోని ఫిల్మ్ సిటీలో ఘనంగా బుధవారం నిర్వహించారు. ఈ అవార్డుల ఎంపికను టూరిజం, హాస్పిటాలిటీ, విమానయాన రంగాలకు చెందిన నాయకులు, దూరదృష్టి ఉన్న సభ్యులు జ్యూరీ ప్యానెల్‌లో ఉంటారు. ఈ అవార్డును ఎస్‌టీఐసీ ట్రావెల్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మెన్ సుభాష్ గోయల్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ అధ్యక్షుడు రవి గోసిన్ సదరన్ ట్రావెల్స్‌కు ప్రదానం చేశారు. సదరన్ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణమోహన్ ఆలపాటి మాట్లాడుతూ తాము రెండోసారి గ్లోబల్ టూరిజం అవార్డును అందుకోవడం గొప్ప గౌరవంగా భావిస్తున్నామని అన్నారు. తమ కస్టమర్ల విశ్వాసం, సిబ్బంది అంకితభావంతో చేసిన కృషికి ఇది గుర్తింపు అని చెప్పారను. ప్రయాణాన్ని సౌకర్యవంతంగా మాత్రమే కాకుండా స్ఫూర్తిదాయకంగా, మరుపురాని అనుభూతిగా చేయడమే తమ లక్ష్యమని వివరించారు.

'చుక్కా రామయ్యకు పద్మవిభూషణ్ ఇవ్వాలి'

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలుగు రాష్ట్రాల విద్యార్థులను సాంకేతిక సైన్యంగా తయారుచేసి, తరగతిగదే ప్రాణంగా జీవించిన స్వాతంత్ర సమరయోధుడు చుక్కా రామయ్యకు కేంద్ర ప్రభుత్వం పద్మ వి భూషణ్ ఇచ్చి సత్కరించాలని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ కోరారు. వేలాదిమంది ఐఐటీలను తయారుచేసి దేశానికి ప్రపంచానికి అందించిన చుక్కారామయ్య రెండు తెలుగు రాష్ట్రాలు గర్వించదగిన వ్యక్తి అని పేర్కొన్నారు. గాంధీ 156వ జయంతి సందర్భంగా ప్రముఖ గాంధీయవాది, రచయిత డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ రచించిన "గ్లోబల్ రోల్ మోడల్ మహాత్మా గాంధీ " అన్న పుస్తకాన్ని ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య బుధవారం తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జూలూరు మాట్లాడుతూ అమెరికాలోని సిలికాన్ వాలీ తెలుగు విద్యార్థులతో నిండిపోవడానికి కారకుడు రామయ్యే అన్నారు. దేశం ఆత్మ గ్రామము అని గాంధీజీ చెప్పారని, తెలంగాణ గ్రామాల విముక్తి కోసం చుక్కారామయ్య తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని జైలు జీవితాన్ని అనుభవించారని గుర్తు చేశారు. పుస్తక రచయిత డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ మాట్లాడుతూ గాంధీని విడదీసి భారతదేశం చూస్తే దేశం కొత్తగా, మనది కాదన్నట్లుగా కనిపిస్తుందని చెప్పారు. గాంధీ వ్యక్తిత్వం, ఆయన ఆలోచనలు ఆచరణ, తాత్వికత నేటి కాలానికి ఎంత అవసరమో గ్లోబల్ రోల్ మోడల్ గాంధీ పుస్తకంలో వివరించినట్లు తెలిపారు. తెలంగాణ పబ్లికేషన్స్ వ్యవస్థాపకుడు కోయ చంద్రమోహన్ మాట్లాడుతూ నేటి సమాజానికి గాంధీ ఎంత అవసరమో రచయిత నాగసూరి ఈ పుస్తకంలో వివరించారని పేర్కొన్నారు. ఈ పుస్తకావిష్కరణలో రామానంద తీర్థ గ్రామీణ విద్యా సంస్థ చైర్మన్ నారా కిషోర్ రెడ్డి, రామయ్య తనయుడు సైంటిస్ట్ చుక్కా శ్రీనివాస్, ఫస్ట్ రీల్ ఎం.డి. జూలూరు శివసాగర్, చేగోని, కోటి తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చుక్కా రామయ్య

మంత్రి పొన్నం నివాసంలో బిసి నేతల కీలక సమావేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో బిసి నేతల కీలక సమావేశం జరిగింది. పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, సీనియర్ నాయకులు వి.హనుమంతరావు, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, పలువురు ఎమ్మెల్యేలు సమావేశంలో పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు తదితర అంశాలపై చర్చించారు. న్యాయపరమైన అంశాల్లో రిజర్వేషన్లపై ఎలా ముందుకెళ్లాలనే దానిపై సమాలోచనలు జరిపారు. 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతే ఎన్నికలకు వెళ్తామని నేతలు ధీమా వ్యక్తం చేశారు.

తమిళనాడు తరహాలో ఇక్కడ కూడా రిజర్వేషన్లు అమలు అవుతాయి. తమిళనాడులో ఇటీవల కోర్టు తీర్పు గవర్నర్, రాష్ట్రపతి వద్ద ఉన్న పెండింగ్ బిల్లులు మూడు నెలలకు మించి ఉంటే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసుకోవచ్చని ఉందని, ఈ నేపథ్యంలో తెలంగాణలో కూడా రిజర్వేషన్లు అమలు అవుతాయని నేతలు భావిస్తున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిజిపి

త్వరలో 17 వేల కానిస్టేబుల్ పోస్టుల భర్తీ

- రాజకీయాలతో మాకు సంబంధం లేదు.. మాది ఖాకీ బుక్
- బేసిక్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి
- స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా జరిపిస్తాం
- డిజిపి బత్తులు శివధర్‌రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

త్వరలోనే 17 వేల పోలీస్ కానిస్టేబుళ్ల పోస్టులను భర్తీ చేస్తామని పోలీస్ డైరెక్టర్ జనరల్ (డిజిపి) బత్తుల శివధర్‌రెడ్డి ప్రకటించారు. స్థానిక సంస్థల ఎన్నికల బందోబస్తుపై ప్రత్యేక దృష్టిసారిస్తామని, ఆ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూస్తామని హామీనిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని డిజిపి కార్యాలయంలో అదనపు డిజి మహేశ్‌భగవత్ నుంచి శిధర్‌రెడ్డి ఉదయం 9:43 నిమిషాలకు డిజిపిగా బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎన్నికల సందర్భంగా రాజకీయ పక్షాలు తమ హద్దులను మీరకుండా ప్రచారపర్వాన్ని సాగించుకునేలా అన్నిరకాల జాగ్రత్తలను తీసుకుంటామన్నారు. తెలంగాణలో మావోయిస్టుల కార్యకలాపాలు దాదాపుగా తగ్గిపోయాయని తెలిపారు. మావోయిస్టులతో చర్చలు జరిపే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. వారి అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ ఆయుధాలను వదిలేసి జనజీవన స్రవంతిలో కలిసే విషయంపై యోచన చేస్తున్నట్టు ప్రకటించారనీ, ఈ విషయం ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టు పార్టీ కార్యదర్శి బసవరాజు ఎలియాస్ నంబాల కేశవరావు బతికి ఉన్నప్పటి నిర్ణయంగా వేణుగోపాల్ స్టేట్‌మెంట్‌ను బట్టి తెలుస్తోందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న ప్రతి అంశంపైనా పింక్‌బుక్‌లో నమోదు చేసుకుంటామని ప్రతిపక్ష నేతల నుంచి వస్తున్న వ్యాఖ్యలను ఆయన దృష్టికి విలేకర్లు తీసుకెళ్లగా...రాజకీయపరమైన వ్యాఖ్యలను, ప్రకటనల్ని తాము పట్టించుకోబోమనీ, తమది మాత్రం ఖాకీబుక్ అని చలోక్తి విసిరారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో, ఈగల్ విభాగాకు అన్ని హంగులనూ కల్పిస్తున్నామనీ, భవిష్యత్తులో మరిన్ని జవసత్వాలు కల్పిస్తామని హామీనిచ్చారు. పోలీసుల విధి నిర్వహణ అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్నదనీ, విజిబుల్ పోలీసింగ్ వ్యవస్థ కారణంగా నేరాలకు అడ్డుకట్ట వేయగలుగుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల అదుపు విషయంలో ఇప్పటికే జాతీయ స్థాయిలో కీర్తిని గడించడం జరిగిందనీ, ఇకముందు కూడా పోలీస్ వ్యవస్థను సమిష్టిగా నడిపిస్తూ మంచి ఫలితాలను తీసుకొస్తామని ఆయన తెలిపారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ప్రభుత్వానికీ, సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన విశ్వాసాన్ని వమ్ముచేయబోనని తెలిపారు. సోషల్‌మీడియాలో హద్దులు దాటేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో శాంతిభద్రతల అదనపు డిజి మహేశ్‌భగవత్, మూడు పోలీస్ కమిషనరేట్ల సిపిలు విసి సజ్జనార్, అవినాశ్ మహంతి, సుధీర్‌బాబుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

గవర్నర్, సిఎంలను కలిసిన డిజిపి

బాధ్యతలు స్వీకరించిన అనంతరం రాష్ట్ర డిజిపి బత్తుల శివధర్‌రెడ్డి నగర పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్‌తో కలిసి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సిఎం రేవంత్‌రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు. గవర్నర్‌ను రాజ్‌భవన్‌లో, సిఎంను ఆయన నివాసంలో కలిశారు.

చార్జ్ తీసుకున్న కొత్త ఇంటిలిజెన్స్ చీఫ్ విజయ్‌కుమార్

రాష్ట్ర నిఘా విభాగం అధిపతిగా అదనపు డిజి విజయ్‌కుమార్ బుధవారం లక్డీకాపూల్‌లోని తన కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఆయన నాలుగో ఇంటిలిజెన్స్ చీఫ్‌గా ఎంపికయ్యారు.

కాంగ్రెస్ వచ్చాకే 700కుపైగా రైతన్నల బలవన్మరణాలు

- బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే 700 మందికి పైగా రైతన్నలు బలవన్మరణాలకు పాల్పడడంపై బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావు ఆందోళన వ్యక్తం చేశారు. కెసిఆర్ హయాంలో రైతుబంధు పాలన స్వర్ణయుగమని పేర్కొన్నారు. అప్పుడు రైతుల ఆత్మహత్యలు దేశంలోనే రికార్డు స్థాయిలో 96 శాతం తగ్గాయంటూ కేంద్ర ప్రభుత్వ లెక్కలు చెప్తున్నాయని వివరించారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అద్భుతమైన ప్రగతిని సాధించిన తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే పరిస్థితి తారుమారైందని తెలిపారు. కెసిఆర్ పాలన ముగిసే నాటికి 56 మంది రైతుల ఆత్మహత్యలు నమోదైతే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కేవలం రెండేళ్లలోనే సుమారు 700కు పైగా అన్నదాతల బలవన్మరణాలు నమోదయ్యాయని వివరించారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ, అమానవీయ పాలనకు నిదర్శనమని విమర్శించారు. ఎన్‌సిఆర్‌బి నివేదిక ప్రకారం, గత పదేండ్లలో కెసిఆర్ హయాంలో రైతుల ఆత్మహత్యల తగ్గింపు దేశంలోనే అత్యధికంగా తెలంగాణలోనే నమోదైందని ప్రకటించిందని పేర్కొన్నారు. 2014లో రాష్ట్రంలో రైతులు, కౌలుదారులు, రైతు కూలీల ఆత్మహత్యల సంఖ్య 1,347గా ఉంటే, కేసిఆర్ పాలన ముగిసే నాటికి, 2023 నాటికి ఆ సంఖ్య కేవలం 56కు తగ్గిందని తెలిపారు. రైతుల బలవన్మరణాల్లో 95.84 శాతం తగ్గుదల నమోదైందని పేర్కొన్నారు. 2014లో దేశంలోని మొత్తం రైతుల ఆత్మహత్యల్లో తెలంగాణ వాటా 10.9 శాతం ఉంటే, 2023 నాటికి అది కేవలం 0.51 శాతానికి తగ్గిందని వివరించారు.

వర్షాలు తగ్గినా.. వరద తగ్గట్లే

- శ్రీరాంసాగర్, నిజాంసాగర్‌కు భారీ ఇన్‌ఫ్లో
- అదే స్థాయిలో దిగువకు నీటి విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టులకు వరద పోటెత్తుతోంది. దాంతో అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ వచ్చిన వరదను వచ్చిది వచ్చినట్టే దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ప్రస్తుతం మూడు లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా.. 2.59 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అదే విధంగా నిజాంసాగర్ ప్రాజెక్టుకు లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా.. 77 వేల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టుల పూర్తిస్థాయి సామర్థ్యం కంటే తక్కువ స్థాయిలోనే నీటిని అధికారులు నిల్వ ఉంచుతున్నారు. పూర్తిస్థాయి నీటిమట్టం వరకు నీటిని నిల్వ ఉంచితే.. ప్రాజెక్టు ఎగువభాగంలోని పలు గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని అధికారులు తెలిపారు. ఉత్తర తెలంగాణ వర ప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతమైన మహారాష్ట్రతో పాటు, మంజీరా నుంచి గోదావరికి ప్రవాహం కొనసాగుతున్నది. దాంతో భారీ ఎత్తున వరద వచ్చి చేరుతుంది. బుధవారం మధ్యాహ్నం రెండు గంటల సమయానికి ప్రాజెక్టులోకి మూడు లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా.. 39 గేట్లు ఎత్తి 2.50 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. వారం రోజులుగా సగటున 3.57 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా.. మూడు లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ ఏడాది జూన్ 1వ తేదీ నుంచి ప్రాజెక్టులోకి 735.08 టీఎంసీల నీరు వచ్చి చేరగా.. దిగువకు 686.358 టిఎంసిల నీటిని విడుదల చేశారు.

నిజాంసాగర్‌కు సైతం..

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాను సస్యశ్యామలం చేసే నిజాంసాగర్ ప్రాజెక్టుకు సైతం భారీ వరద ప్రవాహం కొనసాగుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి, సింగూరు ప్రాజెక్టు నుంచి వరద కొనసాగుతుంది. నిజాంసాగర్ ప్రాజెక్టుకు ప్రస్తుతం 1.01 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా.. 15 గేట్లు ఎత్తి 77 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దాంతో మంజీరా నది పరివాహక ప్రాంతాలు జలకళను సంతరించుకున్నాయి. దిగువకు వదులుతున్న నీరు నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం కందకుర్తి వద్ద గోదావరిలో కలుస్తున్నాయి.

ఆ ప్రాంతాలకు వరద ముప్పు

కాగా ప్రాజెక్టుల వరద ప్రవాహం కొనసాగుతుండటంతో.. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. దాంతో అధికారులు.. ప్రాజెక్టుల్లో పూర్తిస్థాయి కంటే తక్కువ సామర్థ్యంతో నీటిని నిల్వ ఉంచుతున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 1091 అడుగులు(80.5 టిఎంసిలు) కాగా ప్రస్తుతం 1086 అడుగుల(63.973 టిఎంసిల) నీటిని నిల్వ ఉంచారు. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం కంటే 16.5 టీఎంసీల తక్కువస్థాయిలో నీటిని నిల్వ ఉంచారు. ఇన్‌ఫ్లో తగ్గే క్రమంలో క్రమంగా నిల్వసామర్థ్యం పెంచుతున్నారు.

అదే విధంగా నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1405 అడుగులు(17.802 టిఎంసిలు) కాగా ప్రస్తుతం 1402 అడుగులు(14.201 టీఎంసీలు) మేర నీటిని నిల్వ చేశారు. పూర్తిస్థాయి సామర్థ్యం కంటే 3.6 టిఎంసిల నీటిని తక్కువ స్థాయిలో నిల్వ ఉంచుతున్నారు.

పెండింగ్ పింఛన్లను మంజూరు చేయాలి

- అనుమతి లేని స్పెషల్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి
- వికలాంగులందర్నీ సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల్లో చేర్చాలి
- ప్రజావాణి నోడల్ అధికారి దివ్యదేవరాజన్‌కు ఎన్‌పిఆర్‌డి బృందం వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని పెండింగ్ పింఛన్లు అన్నింటినీ వెంటనే మంజూరు చేయాలని, సదరం సర్టిఫికెట్ ఉన్న ప్రతి ఒక్కరికీ యుడిఐడి కార్డు జారీ చేయాలని ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర అధ్యక్షులు కె వెంకట్, ప్రధాన కార్యదర్శి ఎం అడివయ్య, కోశాధికారి ఆర్ వెంకటేశ్ డిమాండ్ చేశారు. అనుమతిలేని ఆటీజం, స్పీచ్, హియరింగ్, స్పెషల్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజావాణి నోడల్ అధికారి, సెర్ప్ సిఇఒ దివ్య దేవరాజన్‌కు వారు వినతిపత్రం అందజేశారు. వికలాంగుల సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అన్ని సంక్షేమ పథకాలకు యూడీఐడీ కార్డులు వర్తింపజేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. యూడీఐడీ కార్డులను తీసుకెళ్తే డిపోలలో బస్సు పాసులు ఇవ్వని విషయాన్ని లేవనెత్తారు. రాష్ట్రంలో వికలాంగులతో ఏర్పాటు చేయబోతున్న 18వేల సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల్లో ప్రతి వికలాంగున్ని కూడా చేర్చుకోవాలని కోరారు. గ్రామానికి 5-10 మంది చొప్పున తీసుకుంటే మిగతా వికలాంగులకు తీవ్ర నష్టం జరుగుతుందని వాపోయారు. ఆ గ్రూపుల్లో చేరేవారికి 10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇప్పించాలని విన్నవించారు. చేయూత పింఛన్లకు ఆదాయ పరిమితి విధించే జీవో 17లోని కఠిన నిబంధలను సరళీకరించాలని కోరారు. చేయూత పింఛన్లను పూర్తిస్థాయిలో ఇవ్వకుండా రూ.16 కట్ చేస్తున్న వైనాన్ని ఆమె దృష్టికి తీసుకొచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు పింఛన్ లబ్ధిదారుల వివరాలు ఎక్కడ కూడా నమోదు చేయడం లేదని, అన్ని గ్రామాల్లో లబ్ధిదారులు వివరాల కోసం ప్రత్యేక రిజిస్టర్లలో పేర్లు నమోదు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్తామని హామీనిచ్చారు.

ఎమ్మెల్యేల అనర్హతపై విచారణ 4కు వాయిదా

- ఇద్దరు ఎమ్మెల్యేలను విచారించిన స్పీకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల విచారణ ఈ నెల నాలుగుకు వాయిదా పడింది. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తన ఛాంబర్‌లో ట్రిబ్యునల్ పదవ షెడ్యూల్ కింద రెండో రోజు విచారణ కొనసాగించారు. ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు వారి న్యాయవాదులు, వారిపై ఫిర్యాదు చేసిన బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేల న్యాయవాదులు విచారణకు హాజరయ్యారు. సోమవారం ఎమ్మెల్యేల తరుపు న్యాయవాదులు పిటీషనర్ల తరుపు న్యాయవాదులను క్రాస్ ఎగ్జామిన్ చేయగా, బుధవారం జరిగిన విచారణలో పిటీషనర్ల తరుఫు న్యాయవాదులు ఎమ్మెల్యేల తరుఫు న్యాయవాదులను క్రాస్ ఎగ్జామిన్ చేశారు. మొదట రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ న్యాయవాదులు ఆయనపై ఫిర్యాదు చేసిన బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ న్యాయవాదుల మధ్య విచారణ కొనసాగింది. ఆ తర్వాత చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య న్యాయవాదులు ఆయనపై ఫిర్యాదు చేసిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ న్యాయవాదుల మధ్య వాదనలు జరిగాయి. ఎమ్మెల్యేలపై ఫిర్యాదు చేసిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, వారి న్యాయవాదులకు స్పీకర్ గంట చొప్పున సమయాన్ని కేటాయించారు. పార్టీ మారిన అనేక అంశాలపై వాదనలు జరిగినట్టుగా తెలిసింది. క్రాస్ ఎగ్జామినేషన్‌లో పిటిషనర్ల అడ్వకేట్లు అనేక ప్రశ్నలు అడిగినట్లు సమాచారం. వారి నుంచి వివరాలు రాబట్టుకునేందుకు తమ దగ్గరున్న సాక్ష్యాలతో వాదనలు వినిపించినట్టు తెలిసింది. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల విచారణలో సమయం సరిపోకపోవడంతో ఎమ్మెల్యేలు గూడెం మహిపాల్ రెడ్డి, బండ్ల కృష్ణ మోహన్ రెడ్డిల విచారణను ఈ నెల 4కు స్పీకర్‌వాయిదా వేశారు.

NOTICE
IN THE COURT OF THE
PRL.DIST.JUDGE::GUNTUR
M.V.O.P.NO.1096/2024

Between:
Gorentla@Nandam Sharon Syam Supriya .... Petitioner
And
Gogu Sankar& Others.... Respondents

To,
R-1: Gogu Sankar,S/o.Ramulu, R/o.Door No.1-9-312/5,Achitreddy Marg, Street No.6,Vidhya Nagar, Hyderabad
(Owner of the Vehicle,AP 36 E 8866)

పై నెంబరు ఒ.పి.లోని పిటీషనరు యాక్సిడెంటులో గోరెంట్ల బాల స్వామి మరణించినందున నష్టపరిహారం కొరుచూ దాఖలు చేసిన పిటిషనులో1వ రెస్పాండెంటు అయిన మీకు పై కోర్టు వారి నుండి ఎన్ని సార్లు నోటీసులు పంపించినను ముట్టనందున ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసులు తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది.16-10-2025కి వాయిదా వేసినారు. కావున వాయిదా రోజు ఉ.గం.10-30ని.లకు పై కోర్టు వారి యెదుట హాజరై మీకు గల అక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)

వాయిదా తేది:16-10-2025

శ్రీమతి యం.చారులత,
పిటీషనరు తరపు అడ్వకేట్,
7/1 అరండల్ పేట, గుంటూరు

13 నుంచి ప్రయివేటు కాలేజీల నిరవధిక సమ్మె

- తరగతుల బంద్ పాటిస్తాం
- రాష్ట్ర ప్రభుత్వానికి యాజమాన్యాల డెడ్‌లైన్
- సిఎం రేవంత్‌రెడ్డి వీలును బట్టి 18లోపు సమావేశం
- ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య చైర్మన్ రమేష్‌బాబు

సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రమేష్‌బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.పది వేల కోట్లున్నాయి. వాటిలో టోకెన్లు ఇచ్చిన నిధులు రూ.1,200 కోట్ల వరకు ఉన్నాయి. దసరా నాటికి రూ.600 కోట్లు, మిగిలిన రూ.600 కోట్లు దీపావళి నాటికి ఇస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. బుధవారం రూ.200 కోట్లు మాత్రమే కాలేజీ యాజామాన్యాలకు ప్రభుత్వం విడుదల చేసింది. దసరా ఇస్తామన్న రూ.400 కోట్లు, దీపావళి నాటికి ఇస్తామన్న రూ.600 కోట్లు కలిపి రూ.వెయ్యి కోట్లు ఈనెల 12వ తేదీ నాటికి విడుదల చేయాలి. లేదంటే ఈనెల 13 నుంచి రాష్ట్రంలోని ప్రయివేటు ఇంజనీరింగ్, వృత్తి విద్యా కాలేజీలు నిరవధిక సమ్మె చేపడతాం. తరగతుల బంద్ పాటిస్తాం'అని ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య (ఫాతి) చైర్మన్ నిమ్మటూరి రమేష్‌బాబు ప్రకటించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం దసరా నాటికి రూ.600 కోట్లు విడుదల చేయకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు అత్యవసర సమావేశాన్ని బుధవారం నిర్వహించాయి. అనంతరం ఫాతి చైర్మన్ నిమ్మటూరి రమేష్‌బాబు, సెక్రెటరీ జనరల్ రవికుమార్ మీడియాతో మాట్లాడుతూ రూ.200 కోట్లే విడుదల చేసినందుకు బాధ ఉన్నా ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెప్పారు. మిగిలిన రూ.వెయ్యి కోట్లు ఎప్పుడిస్తారో, ఎలా చెల్లిస్తారో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 13 నుంచి 18 వరకు ఫాతి ఆధ్వర్యంలో వారంరోజులపాటు నిరసన, సత్యాగ్రహ దీక్షలను చేపడతామని వివరించారు. అవసరమైతే చలో హైదరాబాద్, రాస్తారోకోలు నిర్వహిస్తామన్నారు. ఒక్కో జిల్లాలో ఒక్కో రూపంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి నిరసన కార్యక్రమాలుంటాయని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యాశాఖ బాధ్యతలను నిర్వహిస్తున్నందున ఇక నుంచి తమ చర్చలన్నీ సిఎం కార్యాలయంతోనే ఉంటాయని స్పష్టం చేశారు. ఈ నెల 13 నుంచి 18 లోపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీలును బట్టి సమావేశాన్ని నిర్వహిస్తామని, రాష్ట్రంలోని 2,500 కాలేజీ యాజమాన్యాలు హాజరవుతాయని వివరించారు. 2023-24 విద్యాసంవత్సరం బకాయిల్లో 50 శాతం విడుదల చేశామంటూ ప్రభుత్వం చెప్తోందన్నారు. కానీ 2021-22, 2022-23 విద్యాసంవత్సరాల్లో ఉన్న బకాయిల టోకెన్లను రద్దు చేసిందని అన్నారు. ఆ టోకెన్లకు సంబంధించిన నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత విద్యాసంవత్సరంతో కలిపితే రాష్ట్రంలో రూ.పది వేల కోట్ల వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. ఇందులో బీఆర్ఎస్ హయాంలో రూ.4,500 కోట్లు, కాంగ్రెస్ వచ్చాక రూ.5,500 కోట్ల బకాయిలున్నాయని వివరించారు. విద్యార్థుల భవిష్యతు, యాజమాన్యాల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం టోకెన్ల సొమ్ము విడుదల చేయకపోవడంతో దసరా పండుగ నిర్వహించుకోలేని పరిస్థితిలో ఉన్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఫాతి కోశాధికారి కొడాలి కృష్ణారావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కె సునీల్‌కుమార్, ప్రతినిధులు రేపాక ప్రదీప్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, గుర్రం నాగయ్య చౌదరి, కె రామదాస్, అల్జాపూర్ శ్రీనివాస్, సూర్య నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బిఎస్ఎన్ఎల్ 25వ వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
బిఎస్ఎన్ఎల్ 25వ వార్షికోత్సవ వేడుకలను బుధవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. స్వదేశీ బిఎస్ఎన్ఎల్ పేరిట ప్రతి మారుమూల గ్రామానికి నెట్‌వర్క్ సేవలను అందించే లక్ష్యంగా తాము పని చేస్తున్నామని బిఎస్ఎన్ఎల్ ఆదిలాబాద్ జిల్లా ఎజిఎం సీతారాం అన్నారు. కార్యాలయంలో సంఒ వేడుకల్లో ఆయన మాట్లాడారు. సంస్థ లక్ష్యాలను వివరించారు. ప్రతి మారుమూల పల్లెకూ తమ సేవలను విస్తరించేలా పని చేయాలని ఉద్యోగులకు సూచించారు. ప్రతి పల్లెకూ నెట్‌వర్క్ అందించాలనే ఉద్దేశంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ స్వదేశీ బిఎస్ఎన్ఎల్ ప్రాజెక్టు చేపట్టారని, దానికి అనుగుణంగా ఆదిలాబాద్ జిల్లాలో పనులు ముమ్మరంగా సాగుతున్నాయని, ఆ పనులు డిసెంబర్ చివరి నాటిని పూర్తి చేస్తామన్నారు. ప్రజలు బిఎస్ఎన్ఎల్ సేవలను వినియోగిస్తూ సంస్థను ఆదరించాలని కోరారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని టెలిఫోన్ భవన్‌లో బీఎస్ఎన్ఎల్ రజతోత్సవ వేడుకలు జరిపారు. రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి రోడ్ షో నిర్వహించారు అనంతరం బిఎస్ఎన్ఎల్ వినియోగదారులను సన్మానించా రు.బిఎస్ఎన్ఎల్ 25వ వార్షికోత్సవం వేడుకలను జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలో బిఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఆటపాటలు ఉత్సవాలను నిర్వహించారు.

బిఆర్ఎస్‌తో నాకు ఎలాంటి సంబంధం లేదు

- స్థానిక ఎన్నికలపై ఈటెల వ్యాఖ్యలు సరికాదు
- తెలంగాణ జాగృతి అధ్యక్షులు కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
బిఆర్ఎస్‌తో తనకు ఎలాంటి సంబంధం లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షులు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని జాగృతి కార్యాయలంలో మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ బాకీ కార్డు అనేది బీఆర్ఎస్ రాజకీయ అంశమని తేల్చి చెప్పారు. ప్రజలకు ఇస్తున్న హామీలపై ప్రశ్నిస్తున్న ఆ పార్టీ బిసిల సమస్యలపై ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ ఎన్నికల్లో పోటీ చేయొద్దని చెప్పడాన్ని కవిత తప్పు పట్టారు. ఈటెల మాటలు పార్టీ స్టాండా? వ్యక్తిగతమా? స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కోర్టులు తేల్చాల్సిన అంశాన్ని ఆయన ముందుగా ఎలా చెబుతారని ప్రశ్నించారు. గవర్నర్ దగ్గరున్న ఆర్డినెన్స్, బిల్లుల ఆమోదానికి కృషి చేయకుండా బిసి రిజర్వేషన్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల రిజర్వేషన్లను ఇష్టా రీతిన ఖారారు చేసిందని ఆరోపించారు. కొన్ని గ్రామ పంచాయతీల్లో ఎస్‌టిలు లేకపోయినా వారికి సర్పంచ్ పదవి రిజర్వ్ చేశారని అన్నారు. గిన్నిస్ రికార్డు కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మ పండుగను నిర్వహించిందని విమర్శించారు. బతుకమ్మ చీరలు ఇవ్వకుండా తెలంగాణ ఆడపడుచులను కాంగ్రెస్ రెండో ఎడాది మోసం చేసిందని గుర్తు చేశారు.

కాంగ్రెస్ పాలనలో రైతు ఆత్మహత్యలు పెరిగాయి

- ఎన్‌సిఆర్‌బి గణాంకాలు కాంగ్రెస్‌కు చెంపపెట్టు
- మాజీ మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
రెండేండ్ల కాంగ్రెస్ పాలనలో రైతు ఆత్మహత్యలు పెరిగాయని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. నేషనల్ క్రైం రికార్డు బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) గణాంకాలే అందుకు నిదర్శనమని అన్నారు. కాంగ్రెస్ నాయకులు ఈ లెక్కలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో అన్నదాతల ఆత్మహత్యలు రికార్డు స్థాయిలో 95.84 శాతానికి తగ్గాయని చెప్పారు. రాష్ట్రంలో 2014లో 1,347 రైతు ఆత్మహత్యలు నమోదు కాగా, 2023 నాటికి 56కి తగ్గిందని అన్నారు. దేశ వ్యాప్తగా 2023లో 10,786 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోగా అందులో తెలంగాణ వాటా కేవలం 0.51 శాతం మాత్రమేనని గుర్తు చేశారు. తెలంగాణ రైతాంగంతో కెసిఆర్‌దీ పేగు బంధమని గుర్తు చేశారు. తమ సర్కార్ చేపట్టిన రైతు సంక్షేమ పథకాలైన రైతు బంధు, రుణమాఫీ తదితర పథకాలే తమ పాలనకు నిదర్శనమని అన్నారు.

విద్యుద్ఘాతంతో ఆపరేటర్ మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బోర్నపల్లి గ్రామంలో ఉన్న 132 కెవి సబ్‌స్టేషన్‌లో బుధవారం ప్రమాదవశాత్తు విద్యుద్ఘాతంతో గ్రేడ్-2 ఆపరేటర్ మృతిచెందాడు. హుజూరాబాద్ మండలంలోని రంగాపూర్ గ్రామానికి చెందిన బోడ శంకర్‌రెడ్డి (40) బోర్నపల్లి 132 కేవీ సబ్ స్టేషన్‌లో ఆర్టీజియన్ గ్రేడ్-2 అసిస్టెంట్ ఆపరేటర్‌గా విధులు నిర్వర్తించేవాడు. బుధవారం సబ్‌స్టేషన్‌లో స్తంభంపై మరమ్మతులు చేస్తున్న సమయంలో షార్ట్ సర్క్యూట్ జరిగింది. దాంతో విద్యుత్ షాక్ తగిలి శంకర్‌రెడ్డి అక్కడికక్కడే ప్రాణం కోల్పోయాడు. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బాధితుడి కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూరాబాద్‌లోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మాజీ మంత్రి లక్ష్మారెడ్డి తల్లి మృతిపై కెటిఆర్ సంతాపం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి సి.లక్ష్మారెడ్డి తల్లి లక్ష్మమ్మ మృతిపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ విషాద సమయంలో లక్ష్మారెడ్డి, వారి కుటుంబ సభ్యులందరికీ కెటిఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. లక్ష్మమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని కెటిఆర్ పేర్కొన్నారు.

అన్ని స్థానాల్లోనూ పోటీ

- బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్రరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని చోట్లా పోటీ చేస్తామని, మొదట జడ్‌పిటిసి స్థానాలకు అభ్యర్థులను ప్రకటిస్తామని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచందర్‌రావు అన్నారు. వార్డు మెంబర్ నుంచి జడ్‌పిటిసి దాకా అన్ని స్థానాల్లోనూ బిజెపి పోటీ చేస్తుందని, అత్యధిక స్థానాలను సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కరీంనగర్ పట్టణంలో బుధవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా అభ్యర్థుల ఎంపిక కార్యక్రమం మొదలైందన్నారు. ముందు జడ్‌పిటిసి అభ్యర్థులను డిక్లేర్ చేయాలని, ఏకగ్రీవంగా ఉన్న చోట బీ ఫాం ఇవ్వాలని నాయకులకు సూచించారు. కాంగ్రెస్, బిఆర్ఎస్‌కు ఓట్లు అడిగే అర్హత లేదని, స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసింది బీఆర్ఎస్ అని విమర్శించారు. కేంద్రం నిధులను దారి మళ్లించి గ్రామాలను దెబ్బతీశారని, దీంతో సర్పంచులు ఆత్మహత్య చేసుకునే దుస్థితి కల్పించారని ఆరోపించారు. కాంగ్రెస్ అనేక వాగ్దానాలు చేసిందని, రైతు భరోసా ఇవ్వడం లేదన్నారు. బీఆర్ఎస్ రాష్ట్రాన్ని దోపిడీ చేస్తే..కాంగ్రెస్ మోసాలు చేస్తోందని విమర్శించారు. ఎరువుల పంపిణీ చేతగాక కృత్రిమ కొరతకు పూర్తి బాధ్యత కాంగ్రెస్‌దేనన్నారు. స్థానిక ఎన్నికలు నిర్వహించాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్‌కు లేదని, అందుకే రెండేండ్లు జాప్యం చేసిందని ఆరోపించారు. హైకోర్టు ఆదేశించినందునే తప్పనిసరై ఇష్టం లేకపోయినా ఎన్నికలు నిర్వహిస్తున్నారని, కేంద్ర నిధుల కోసమే నిర్వహిస్తున్నారని అన్నారు. బిజెపి బిసి రిజర్వేషన్లకు కట్టుబడి ఉందని, ఎన్నికలు జరగాలన్నదే తమ అభిమతం అని తెలిపారు. రాష్ట్రంలో బిసిఇ ముస్లింలకు సంబంధించినదేనని, ఎడ్యుకేషన్, ఎంప్లాయిమెంట్‌కు మాత్రమే అప్పుడు పరిమితం చేశారని, ఇప్పుడు వాళ్లకు రాజకీయ రిజర్వేషన్లు కల్పిస్తున్నారని తెలిపారు. దీనికి బీజేపీ అభ్యంతరం వ్యక్తం చేస్తోందన్నారు. స్థానిక ఎన్నికలపై కోర్టు ఏ విధంగా స్పందిస్తోందో వేచి చూడాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో బీఆర్ఎస్ అవినీతి పాల్పడిందని, ఈ ప్రాజెక్టు మొత్తంగా విచారణ చేయాలన్నారు.

బిగ్‌బాస్‌ను వెంటనే నిషేధించాలి

- రెడ్‌లైట్ ఏరియాను తలపిస్తున్న 'షో'
- కోర్టు నోటీసులకు భయపడి దాక్కున్న నాగార్జున
- సిపిఐ సెంట్రల్ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె నారాయణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
సమాజానికి తప్పుడు సంకేతాలు ఇస్తూ యువతను పెడదోవ పట్టిస్తున్న బిగ్‌బాస్‌షోను వెంటనే నిషేధించాలని సిపిఐ సెంట్రల్ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె నారాయణ డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇలాంటి షోలు కుటుంబాలను సైతం విచ్ఛిన్నం చేస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. బిగ్‌బాస్ సమాజానికి మంచి సంకేతాలను ఇచ్చే కార్యక్రమమే అయితే.. దీని హోస్ట్‌గా ఉన్న అక్కినేని నాగార్జున కేసుకు సంబంధించి ఇప్పటీ వరకు ఎందుకు నోటీసులను తీసుకోలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బిగ్ బాస్ షోలో యువతి, యువకులను నాలుగు గోడల మధ్య బంధించడం ఎందుకంటూ ప్రశ్నించారు. నైతిక విలువలకు తిలోదకాలిస్తూ చేస్తున్న ఈ షో ముంబాయి రెడ్‌లైట్ ఏరియాను తలపిస్తోందని వాఖ్యానించారు. గతంలో తాము కోర్టులో వేసిన కేసు ఈ నెల 27న విచారణకు రానుందని గుర్తు చేశారు. సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తున్న ఈ కార్యక్రమాన్ని నిషేధించేంత వరకు విశ్రమించబోమని హెచ్చరించారు.

బిజెపిది లూటీ కోరు ప్రభుత్వం

దేశంలోని కొంతమంది కార్పొరేట్ ఆర్థిక నేరగాళ్లు రూ.16 లక్షల కోట్ల దేశ సంపదను కొల్లగొట్టి విదేశాలకు పారిపోతే, కేంద్రంలో అధికారం ఉన్న బిజెపి ప్రభుత్వం గడిచిన పదేళ్లలో జిఎస్‌టి పేరుతో రూ.15 లక్షల కోట్ల ప్రజల ధనాన్ని లూటీ చేసిందని విమర్శించారు. అదే బిజెపి నాయకులు జిఎస్‌టి తగ్గింపు పేరుతో ప్రతి కుటుంబానికి నెలకు రూ.15 వేల అదా చేస్తున్నామంటూ నీతులు చెబుతున్నారని విమర్శించారు. బీహార్ ఎన్నికల్లో లబ్ది పొందేందుకు నాటకాలాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లద్దాక్ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నేరవేర్చాలని నారాయణ డిమాండ్ చేశారు. ప్రజల అసంతృప్తిని చల్లార్చకపోతే ఎవరైనా వారి ఆగ్రహాన్ని చవిచూడాల్సిందేనన్నారు. యువతలో చైతన్యం పెరగడంతో రాజకీయాల్లో పెనుమార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్లో ఏ రాజకీయ పార్టీలు అక్కడి ప్రభుత్వాల కూల్చలేదనీ, ప్రజా ఉద్యమాల వల్లే అవి పతనమైయ్యాయని గుర్తుచేశారు.

బిజెపి అధికార దాహానికి ప్రభుత్వ వ్యవస్థలు నిర్వీర్యం
సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి

బిజెపి తన అధికార దాహానికి ప్రభుత్వ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తోందని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి విమర్శించారు. ఆ పార్టీ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీలన్ని కలిసి కట్టుగా పోరాడాలని పిలుపు నిచ్చారు. ఖమ్మంలో డిసెంబర్ 26న సిపిఐ వందేళ్ల జాతీయ స్థాయి ముగింపు ఉత్సావాలను పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఇందులో పార్టీ జాతీయ నాయకులతో పాటు దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి ప్రతినిధులు పాల్గొంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, ఇటి నరసింహా పాల్గొన్నారు.

గాంధీజీ జీవితమే సందేశం

ప్రజాశక్తి కల్చరల్
గాంధీజీ జీవితమే సందేశం అని ఆయన జీవిత కాలం అనుసరించిన నియమాలు నేడు అందరూ పాటిస్తే సమాజంలో శాంతి నెలకొంటుంది అని సిబిఐ న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగ మారుతి శర్మ అన్నారు శ్రీ త్యాగరాయ గానసభలోని కళా లలిత కళా వేదికపై గాన సభ నిర్వాహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా మహాత్మా గాంధీ జయంతి వేడుకలు జరిగాయి ముఖ్య అతిథిగా జస్టిస్ నాగ మారుతి శర్మ పాల్గొని మాట్లాడుతూ అహింస సత్యాగ్రహం ఆయుధాలుగా రవి అస్తమించనీ బ్రిటిష్ సామ్రాజ్యవాదుల్ని లొంగదీసుకున్న గాంధీజీ చరిత్ర భారత్ దేశం వున్నంత కాలం నిలుస్తోందని చెప్పారు. హిందూ ముస్లిం ఐక్యత కోసం ఆయన ప్రాణ త్యాగం సైతం చేశారు అని అన్నారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన సభలో బాలల కథా రచయిత చొక్కాపు వెంకట రమణ పత్రికా రచయిత జయ సూర్య గాయకుడు రామ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో ఇక నుంచి ఆధునిక ఫిజియోథెరపీ సేవలు

- రూ.40 లక్షల విలువగల వైద్య పరికరాలను ప్రారంభించిన డైరెక్టర్ బీరప్ప

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
నిమ్స్‌లో ఇకనుంచి ఆధునిక ఫిజియోథెరపీ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు రూ.40 లక్షల విలువ గల మూడు ఆధునిక వైద్య పరికరాలను డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప బుధవారం ప్రారంభించారు. అనంతరం బీరప్ప మాట్లాడుతూ రోగుల చికిత్స, పునరావాస సేవలను మరింత మెరుగు పర్చేందుకు ఈ పరికరాలు ఎంతో దోహదం చేస్తాయని తెలిపారు. డైనామోమెట్రీ (ఫోర్స్ మెజర్‌మెంట్ సిస్టమ్) వల్ల కండరాల బలం, కీళ్ల కదలిక, సంతులనం అంచనా వేయడానికి ఉపయోగపడుతుందని అన్నారు. న్యూరో మస్క్యులోస్కెలిటల్ సమస్యలు, శస్త్రచికిత్స తర్వాత పునరుద్ధరణ, వృద్ధుల్లో పతన నిరోధంలో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఫుట్ ప్రెజర్ అనాలిసిస్ సిస్టమ్ ద్వారా నడక, భంగిమ, పాదపదన వ్యత్యాసాలను అంచనా వేయడానికి వీలవుతుందని వెల్లడించారు. ఇది డయాబెటిక్ ఫుట్‌కేర్, ఆర్థోపెడిక్, న్యూరాలజికల్ రిహాబిలిటేషన్‌లో ఉపయోగిస్తామన్నారు. షార్ట్‌వేవ్ డయాథెర్మీ ద్వారా లోతైన కణజాల చికిత్స, నొప్పి ఉపశమనం, వాపు తగ్గించడంలో ఉపయోగించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇలాంటి ఖరీదైన, అధునాతన వైద్య పరికరాలు రాష్ట్రంలో నిమ్స్ లోనే మొదటిసారి అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ లిజా రాజశేఖర్, అదనపు మెడికల్ సూపరింటెండెంట్లు డాక్టర్ ఎన్ కృష్ణారెడ్డి, డాక్టర్ లక్ష్మి భాస్కర్, అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీభూషణ్ రాజు, మీడియా రిలేషన్స్ ఆఫీసర్ సత్యగౌడ్, ఫిజియోథెరపీ విభాగాధిపతి డాక్టర్ శ్రవణ్‌కుమార్, డాక్టర్ నవీన్, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ ప్రవీణ్, డా.సునీత్ వాగ్రే ఫిజియోథెరపీ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి కోట్లు కాజేసిన ముఠా అరెస్ట్

- మార్కెటింగ్ పేరుతో మనీ లాండరింగ్
- హెబ్సిబా పేరుతో యథేచ్ఛగా దోపిడి
- వరంగల్ పోలీసు కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
పెట్టిన పెట్టుబడికి అధిక మొత్తంలో లాభం ఆశ చూపిస్తూ ప్రజల నుంచి కోట్ల రూపాయలను దోచేసిన నలుగురు సభ్యుల ముఠాను టాస్క్‌ఫోర్స్, జనగామ జిల్లా పాలకుర్తి పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. ఈ ముఠా నుంచి రూ.5.92 లక్షల నగదు, 684.5 గ్రాముల బంగారు నాణాలు, 150 గ్రాముల బంగారు ఆభరణాలు, ఒక కారు, సెల్‌ఫోన్లు, ల్యాప్‌ట్యాప్, రసీదు పుస్తకాలు, క్యాష్ కౌంటింగ్ మిషన్, చెక్‌బుక్స్, స్టాంప్స్‌తో పాటు పొలాలు, ఇంటి స్థలాలకు సంబంధించిన పత్రాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం వరంగల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్‌తో కలిసి వరంగల్ సిపి సన్ ప్రీత్ సింగ్ పాల్గొని కేసు వివరాలు వెల్లడించారు. ప్రధాన నిందితుడైన సూర్యాపేట జిల్లా గడ్డిపల్లి గ్రామానికి చెందిన తిప్పాలి సైదులుతో పాటు పెన్‌పహాడ్‌కి చెందిన పొడిల సురేష్, హుజూర్‌నగర్‌కు చెందిన పొడిల శ్రీధర్, ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా నందిగామకు చెందిన మనుబోతుల రామకృష్ణ.. పాలకుర్తిలో నివాసముంటూ మార్కెటింగ్ పేరుతో మనీ లాండరింగ్ మోసాలకు పాల్పడుతూ ప్రజల నుంచి అందిన కాడికి దోచుకుంటున్నారు. నిందితుడు సైదులు తన భార్య నారాయణమ్మ పేరు మీద హెబ్సిబా పేరుతో ఒక సంస్థను 2023లో ఏర్పాటు చేశాడు. 2024లో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అధిక లాభాలు ఆశ చూపిస్తూ చిట్టీ వ్యాపారం ప్రారంభించాడు. ఈ చిట్టీలో చేరే వారు ముందుగా రూ.6 వేలు చెల్లించాల్సి ఉంటుంది.. సభ్యులు చెల్లించిన డబ్బుల్లో రూ.4వేలు తన వద్దనే డిపాజిట్ చేసుకొని మిగితా రూ.2వేలకు సభ్యులకు ఈ సంస్థపై నమ్మకం కలిగేందుకు రూ.2 వేలు విలువ చేసే వస్తువులను అందజేస్తూ ప్రజలను మోసం చేస్తున్నాడు. వస్తువుల విలువ కేవలం రూ.300లు మాత్రమే ఉంటాయి. ఈ సంస్థలో ఒక సభ్యుడు ఎన్ని సభ్యత్వాలైన పొందవచ్చు. ఇందులో చేరిన ప్రతి సభ్యునికి నెలకు రూ.1000ల చొప్పున 20 నెలల పాటు డబ్బును తిరిగి అందజేసేవాడు.

కాగా, ప్రధాన నిందితుడు మిగితా నిందితులతో కలసి గ్రామాల్లో ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని సుమారు 28,493 సభ్యత్వాలను నమోదు చేసుకోవడంతో పాటు రూ. నాలుగు వేల చొప్పున మొత్తం రూ.11.39 కోట్లు వసూలు చేశాడు. కాగా, మిగిలిన రూ. రెండు వేలలో రూ300 విలువ చేసే వస్తువులు కొనిచ్చి మరో రూ.4.84కోట్లు మోసం చేసినట్టు పోలీసుల దర్యాప్తులో నిర్ధారణ అయిందని సిపి తెలిపారు. ప్రజలు అత్యాశతో ఈ సంస్థలో లక్షల్లో పెట్టుబడులు పెట్టి మోసపోవడంతో ఈ సంస్థపై పోలీసులకు పలు ఫిర్యాదులు వచ్చాయి. దాంతో ఈ ముఠా సభ్యులు ప్రజల సొమ్ముతో పారిపోయేందుకు ప్రయత్నించగా.. గుర్తించిన పోలీసులు ముఠా సభ్యులను అదుపులోకి తీసుకొని విచారించారు. నిందితులు తాముచేస్తున్న మోసాన్ని ఒప్పుకున్నారు. వసూలు చేసిన డబ్బును వివిధ 17 బ్యాంకుల్లో జమ చేసినట్టుగా పోలీసులు గుర్తించారు. బ్యాంకుల్లో ఉన్న రూ.5,48,64,000లకు సంబంధించి ఎలాంటి లావాదేవీలు జరగకుండా ఖాతాలను నిలిపివేసినట్టు సిపి తెలిపారు. ప్రధాన నిందితుడు సైదులుపై గతంలో మెదక్, సూర్యాపేట జిల్లాలతో పాటు ఇల్లందు, ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్లలో సుమారు పదికి పైగా చీటింగ్ కేసులు ఉన్నట్టు వరంగల్ సీపీ వెల్లడించారు. అధిక మొత్తంలో లాభం వస్తున్నదని ప్రజలు బోగస్ కంపెనీలను నమ్మి మోసపోవద్దని, డబ్బులు పెట్టుబడి పెట్టేముందు జాగ్రత్తగా ఆలోచించాలని ప్రజలకు సూచించారు. కాగా, ముఠాను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్స్‌స్పెక్టర్ పవన్, పాలకుర్తి సిఐ జానకీరాం రెడ్డి, ఎస్ఐ దూలం పవన్ కుమార్, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ వంశీకృష్ణ, దిలీప్‌తో పాటు పోలీస్ సిబ్బందిని సిపి అభినందించారు.

టెలీ సేవలు.. సూపర్ స్పెషాల్టీ వైద్యం

- ఉస్మానియా నుంచి రోగులకు టెలీ వైద్య సేవలు
- అందుబాటులో అన్ని రకాల సదుపాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
పెద్దాస్పత్రులకు వెళ్లకుండానే సూపర్ స్పెషాల్టీ వైద్య సేవలు పొందే అవకాశం ఉంది. ఎప్పటి నుంచో ఉస్మానియా ఆస్పత్రి విజయవంతంగా ఈ టెలీ సేవలను రోగులకు అందిస్తోంది. నిత్యం 100 మంది వరకు రోగులు ఈ సేవలను వినియోగించుకుంటున్నట్టు వైద్య వర్గాలు పేర్కొంటున్నాయి. ముఖ్యంగా బస్తీ దవాఖానాలు, అర్బన్ ఆరోగ్య కేంద్రాల్లో ప్రాథమిక వైద్య సేవలు మాత్రమే అందుతున్నాయి. ఏవైనా స్పెషాలిటీ వైద్యం అవసరమైతే దూరప్రాంతాల నుంచి ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులకు రావాల్సిందే. ఈ నేపథ్యంలో వృద్ధులు, స్త్రీలు ఇబ్బందులు పడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. తీరా ఆస్పత్రికి వచ్చి క్యూలో నిలబడి చీటి తీసుకుని వైద్యునికి చూపించుకుని ఇంటికెళ్లే సరికి సాయంత్రం అవుతోంది. ఈ టెలీ మెడిసిన్ సేవలు అందుబాటులోకి వచ్చిన తర్వాత వైద్య సేవలు సులభతరం అయ్యాయి. ఇంటికి దగ్గరలోనే ఈ సేవలను వినియోగించుకునే అవకాశం ఉంది.

వినియోగించుకోవడం ఎలా..?

గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా 250 వరకు బస్తీ దవాఖానాలున్నాయి. మరో 90కి పైనే అర్బన్ హెల్త్ సెంటర్ల ద్వారా రోగులకు సేవలందిస్తున్నారు. జ్వరం, జలుబు, మధుమేహం, అధిక రక్తపోటు, ఇతర చిన్నచిన్న ప్రాథమిక రుగ్మతలకు ఇక్కడ చికిత్స అందిస్తున్నారు. ఇతర ఏమైనా పెద్ద సమస్యలుంటే ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. గ్యాస్ట్రో, ఆర్థో, ఇతర సూపర్ స్పెషాల్టీ సేవలు పొందాలంటే టెలీ మెడిసిన్ ద్వారా నేరుగా పిహెచ్‌సిలో రోగులతో మాట్లాడి సేవలందిస్తున్నారు. బస్తీ దవాఖానాలు, అర్బన్ హెల్త్ సెంటర్‌లోని వైద్యుని వద్ద ఉన్న ట్యాబ్ ద్వారా ఉస్మానియా టెలీమెడిసిన్ కేంద్రంతో అనుసంధానం చేసి సేవలు పొందే వీలు కల్పించారు. ముందురోజు స్లాట్ బుక్ చేసి నిపుణులు అందుబాటులో ఉండేలా చూస్తారు. రోగులు చెప్పే లక్షణాలను బట్టి అవసరమైన టెస్టులు, మందులు ఈ-సంజీవని పోర్టల్ ద్వారా సూచిస్తారు. సర్జరీలు అవసరమైతే ఉస్మానియాకు రెఫర్ చేస్తారు.

టెలీ మెడిసిన్ ద్వారా అందే కీలక సేవలివే

మధుమేహ సమస్యలు, అధిక రక్తపోటు, కీళ్ల నొప్పులు, గ్యాస్ట్రిక్ సమస్యలు, చర్మ సంబంధిత ఇబ్బందులు, జనరల్ మెడిసిన్, ఫిజియోథెరపీ, గుండె సమస్యలు, జీర్ణకోశ ఇబ్బందులు, స్త్రీలకు సంబంధించిన సమస్యలు కీలకంగా ఉన్నాయి. వీటితోపాటు మరికొన్ని రోగాలకు సైతం ఈ టెలీ మెడిసిన్ ద్వారా వైద్య సేవలందిస్తున్నారు.